




ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు

మువ్వన్నెల పండుగకు ముస్తాబు!

నేడు ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో 78వ స్వాతంత్ర్య వేడుకలు

9 శాఖల శకటాల ప్రదర్శన.. 9 స్టాల్స్ ఏర్పాటు





రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు14: తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కేంద్రమైన రాజమహేంద్రవరంలో 78వ స్వాతంత్ర్య దిన వేడుకలు అంగరంగవైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం పూర్తిచేసింది. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు అంబరాన్ని అంటుతున్నాయి. ర్యాలీలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం గురువారం రిహార్సల్స్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్‌తో కలిసి ఏర్పాట్లను, శకటాల ప్రదర్శన, పోలీస్ కవాతులను కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి 9 శాఖల శకటాలను ఏర్పాటుచేశారు. అలాగే 9 స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా, వ్యవసాయం, హార్టికల్చర్, పాఠశాల విద్య, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, డ్వామా, జిల్లా గ్రామీణ నీటి సరఫరాల శాఖ, వైద్యం, పశుసంవర్ధక, రుడా శాఖల శకటాలు ప్రదర్శన ఏర్పాటుచేశారు. అలాగే మెప్మా, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, మత్స్యశాఖ, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్, పౌర సరఫరాలు, పర్యాటక, సహకార, బ్యాంకింగ్, పరిశ్రమలశాఖలకు చెందిన 9 స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా జాతీయ జెండాను ఎగురవేస్తారు. వేడుకల కోసం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.

అన్నిచోట్ల స్వాతంత్ర్య వేడుకలు జరగాలి : కలెక్టర్

జిల్లావ్యాప్తంగా అన్నిచోట్లా 78వ స్వాతంత్ర వేడుకలు జరగాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఈమేరకు కలెక్టర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాన కూడళ్ల, దేవాలయాలు, మసీదులు, చర్చిల వద్ద స్వాతంత్ర్య దిన వేడుకలు జరపాలని, జాతీయ జెండాలు ఆవిష్కరించి ఫొటోలు దిగి గ్రూప్‌లలో పోస్టు చేయాలన్నారు. రాజమహేంద్రవరంలో కందుకూరి వీరేశలింగంపంతులు నివాసం, దామెర్ల ఆర్ట్ గ్యాలరీ, గౌతమి గ్రంథాలయం, పుష్కరఘాట్, వై.జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్, కోటిపల్లి బస్టాండ్, గోకవరం బస్టాండ్, ప్రభుత్వ ఆర్ట్స్‌కాలేజ్, మహిళా కళాశాల, విద్యా సంస్థలు, వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలు, ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, రైతు సేవాకేంద్రాలు, ఎన్టీఆర్ హెల్త్ క్లినిక్స్, అన్నా క్యాంటీన్ల వద్ద స్వాతంత్ర్య దినోత్సవం చేసి ఆయా ఫొటోలను టూరిజం అధికారులకు పంపాలన్నారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకోవాలని కోరారు.





రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌లో గోదావరి హారతి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, కళాకారిణులు


మరింత శోభనిచ్చేలా గోదావరి హారతి

హారతి కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు14: ఆజాదీకా అమృత్ ఉత్సవ్ భాగంగా హర్ ఘర్ తిరంగ జెండా కార్యక్రమంలో భాగంగా గోదావరి నది ఒడ్డున గోదావరి హారతి కార్యక్రమం, జాతీయ జెండా పండుగలో కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొన్నారు. ఆజాదీకా అమృత్ ఉత్సవ్ వేడుకల్లో భాగంగా బుధవారం పర్యాటక, దేవదాయ, మత్స్యశాఖ, ఆర్ఎంసీ ఆధ్వర్యంలో పుష్కర్‌ఘాట్ వద్ద సాంస్కృతిక, ఆధ్యాత్మిక, జాతీయ జెండా ప్రదర్శన, మత్స్యకారుల ప్రదర్శనలు నిర్వహించారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రానున్న రోజుల్లో గోదావరి హారతి కార్యక్రమానికి మరింత శోభ చేకూర్చేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పండితులు శోభాయమానంగా, భక్తి ప్రపత్తులతో హారతులు సమర్పించారు. విజయశంకర సంగీత కళాశాల చిన్నారులు జాతీయ స్ఫూర్తినిచ్చే నృత్య ప్రదర్శన ఇచ్చారు. చివరిగా మత్స్యకారులతో, నృత్య కళాకారులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రశాంతి జెండా ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు.



హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం గోదావరి బండ్ పుష్కరాల రేవు వెలుపల ర్యాలీ నిర్వహిస్తున్న పురందేశ్వరి, ఆదిరెడ్డి శ్రీనివాస్ - 9లో



జేసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న చినరాముడు

జేసీగా చినరాముడు బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 14: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన ఎస్.చిన రాముడు తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా జేసీగా పనిచేసిన తేజ్‌భరత్ బదిలీ అయ్యాక ఇన్‌చార్జి జేసీగా డీఆర్‌వో నరసింహులు వ్యవహరిస్తున్నారు. అయితే తాజాగా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన చినరాముడు బుధవారం వచ్చి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం జిల్లాలో ప్రాధాన్యత అంశాలపై వారు చర్చించుకున్నారు. జేసీ చినరాముడును జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఇతర శాఖ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

‘తూర్పు’ డీడీఎఫ్‌వోకి రాష్ట్రపతి మెడల్

అగ్నిమాపక విభాగంలో రాష్ట్రంలో ఒక్కరికే దక్కిన పురస్కారం

రాజమహేంద్రవరం, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రకటించిన రాష్ట్రపతి పతకాల్లో జిల్లా విపత్తు నిర్వహణ, అగ్నిమాపక అధికారి(డీడీఎఫ్‌వో)గా విధులు నిర్వర్తిస్తున్న చిన్నం మార్టిన్ లూథర్‌కింగ్‌కి రాష్ట్రపతి ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు. రాష్ట్రంలో ఫైర్ సర్వీసుకు సంబంధించి ఆయనొకరికే ఈ గౌరవం దక్కింది. విశాఖపట్నానికి చెందిన మార్టిన్ 1993లో స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌గా అప్పటి విశాఖ జిల్లా వడ్డాది మాడుగులలో సర్వీసులో చేరారు. నర్సీపట్నం, చోడవరం, విశాఖపట్నం, అనకాపల్లిలో పనిచేశారు. 1999లో విశాఖ జిల్లా సహాయ జిల్లా అగ్నిమాపక అధికారిగా ఉద్యోగోన్నతి లభించింది. 2022లో తూర్పుగోదావరికి జిల్లా అధికారిగా వచ్చారు. 2010లో రాష్ట్ర ప్రభుత్వ సేవాపతకం, 2017లో ఉత్తమ సేవాపతకం సాధించారు. అంకిత భావంతో సేవలందిస్తూ అటు అధికారులు, సిబ్బంది ఇటు ప్రజల మన్ననలు పొందారు. 2007లో నర్సీపట్నం ప్రాంతంలో స్కూలు పిల్లలు ప్రయాణిస్తున్న పడవ తాండవ నదిలో మునిగిపోయింది. 11 మంది చిన్నారులు జలసమాధి అయ్యారు. అయితే, పడవ మునిగిన ప్రదేశంలో 70 అడుగుల లోతు ఉండడం, కొండను ఆనుకొని ఉండడంతో మొసళ్ల సంచారం వల్ల వారి మృతదేహాలను వెలికి తీయడానికి ఎవరూ ముందుకు రాలేదు. అప్పట్లో ఆధునిక పరికరాలు కూడా లేవు. ఆ సమయంలో మార్టిన్ విశాఖ స్టేషను ఫైర్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తూ సెలవులో నర్సీపట్నంలో ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే నది వద్దకు వెళ్లిపోయారు. అప్పటి విశాఖ ఎస్పీ వినీత్ బ్రిజ్‌లాల్, నేవీ సిబ్బందితో కలిసి నదిలోకి వెళ్లారు. అప్పటికప్పుడు ప్రత్యేక హుక్‌లు తయారుచేయించి పిల్లల జాడ కనుక్కున్నారు. మరోసారి అదే నదిలో ఉధృతమైన వరదల్లో నలుగురు చిక్కుకోగా రాత్రి సమాచారం అందిన వెంటనే సంఘటనా ప్రదేశానికి వెళ్లి తాళ్లు, కర్రలు ఉపయోగించి తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో ఆ నలుగురినీ సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఇలాంటి సేవలు ఎన్నో ఆయన 31 ఏళ్ల సర్వీసులో ఉన్నాయి. రాజమండ్రిలో వరదల సమయంలో కూడా చాకచక్యం, శ్రమతో అందుబాటులో ఉన్న వనరులనే ఉపయోగించుకొని విశేష సేవలు అందించారు. రాష్ట్రపతి మెడల్ లభించిన మార్టిన్‌ని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, రీజనల్ ఫైర్ అధికారి ఈ.స్వామి ఇతర అధికారులు అభినందించారు.





మీడియాతో మాట్లాడుతున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి

పోలవరం, అమరావతి వేగంగా పూర్తి చేసుకోవాలి

క్షీణించిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టాలి

మీడియాతో మాజీ సీఎం, బీజేపీ నేత కిరణ్‌కుమార్‌రెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు14: వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారిన నేపథ్యంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ముందు అనేక సవాళ్లు ఉన్నాయని మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. పొరుగు రాష్ట్రాలతో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరించుకుని పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసుకోవడం, రాజధాని అమరావతి కట్టుకోవడం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 14 ఏళ్లలో సీఎంగా పనిచేసిన సమయంలో లేని చాలెంజెస్ ఈ ఐదేళ్లలో చంద్రబాబుకు ఉన్నాయన్నారు. జిల్లాల విభజన చేసి రెవెన్యూ డిపార్టుమెంట్‌లో గందరగోళం సృష్టించారని, లా అండ్ ఆర్డర్ అస్తవ్యస్తంగా తయారు చేశారని విమర్శించారు. వైసీపీ అరాచకాలన్నీ ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయని, వాటన్నింటినీ కంట్రోల్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజధాని అమరావతి పూర్తిచేయడానికి రూ.15,000 కోట్లు ఇస్తామని ప్రకటించిందని, దీన్ని త్వరగా పూర్తి చేసుకోవాల్సి ఉందని, అలాగే పోలవరం ప్రాజెక్టును కూడా ఎంత త్వరగా పూర్తి చేయగలిగితే అంత మంచిదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు ఒడిశా, ఛత్తీస్‌ఘడ్‌లతో ఇంటర్ స్టేట్ సమస్యలున్నాయన్నారు. అయితే ఇప్పుడు రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడడం శుభపరిణామమని అన్నారు. పోలవరం పూర్తి చేసే బాధ్యత కేంద్రానిదే కాబట్టి చంద్రబాబునాయుడు ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల సీఎంలను సమన్వయం చేసుకుని త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉంది అన్నారు. గతంలో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కృష్ణా నదిపై వచ్చిన రెండవ ట్రిబ్యునల్ ఆర్డర్‌ను తాను సీఎంగా ఉన్నప్పుడు వ్యతిరేకించి స్టేఆర్డర్ తేవడం జరిగిందని, ఇది సమైక్య ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర నష్టం జరుగుతుందని సుప్రీంకు వెళ్లి స్టే తెచ్చానని, ఇప్పటివరకూ అదే స్టే ఆర్డర్ కొనసాగుతోందన్నారు. దీన్ని త్వరగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కలసి పరిష్కరించుకుని సుప్రీంకోర్టులో మనకు మేలు జరిగేలా చూడాలని, పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలన్నారు.

చంద్రబాబు, పవన్‌ను కలుస్తా...

రాష్ట్రంలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం ఉంది కాబట్టి మాజీ సీఎంగా తాను ముఖ్యమంత్రి చంద్రబాబును, డిప్యూటీ సీఎం పవన్‌ను కలసి తన అభిప్రాయాలు చెబుతానన్నారు. సమస్యలన్నీ సీఎం చంద్రబాబుతో, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో మాట్లాడి ఏవిధంగా ముందుకు పోవాలి అనేది స్పష్టం చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అంతా రెడీ!



» అన్న క్యాంటీన్లు నేటి నుంచే పునః ప్రారంభం

» రాజమహేంద్రిలో 3 క్యాంటీన్లు రేపటి నుంచి..



నగరంలో అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు14: ఓవైపు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, అదే సమయంలో పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు ఐదేళ్ల తర్వాత పునఃప్రారంభమౌతున్నాయి. గురువారం అమరావతి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు వీటిని లాంఛనంగా ప్రారంభిస్తున్నారు. రాజమహేంద్రవరంలో ప్రభుత్వాసుపత్రి వద్ద, క్వారీ సెంటర్‌లోను, మునిసిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్లను ఇప్పటికే నగరపాలక సంస్థ మరమ్మతులు చేసి సిద్ధం చేసింది. సుమారు రూ.30 లక్షల వ్యయంతో మూడింటిని మరమ్మతులు చేయించారు. ఈ అన్న క్యాంటీన్లు 2014 నుంచి 2019 వరకు రాజమహేంద్రవరంలో ఎంతోమంది పేదలు, కూలీలు, కార్మికుల ఆకలిని తీర్చాయి. పేద విద్యార్థులు, చిరుద్యోగులకు సైతం ఇది చాలా ఉపయోగపడేది. తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చాక వీటిని మూసివేయడంతో ముఖ్యంగా నిరుపేదలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిని ప్రారంభించాలని సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు నిర్ణయించారు. ఆమేరకు ఆగస్టు 15న వీటిని ప్రారంభించాలని తలచి పాత నిర్మాణాలకు మరమ్మతులు చేసి తిరిగి సిద్ధం చేశారు. రాజమహేంద్రవరంలో మాత్రం మూడు అన్న క్యాంటీన్లను ఈనెల 16న ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో వాటిని బుధవారం కమిషనర్ కేతన్ గార్గ్ పరిశీలించారు. ఇక రాజమహేంద్రవరంతోపాటు జిల్లాలో ప్రారంభమౌతున్న అన్న క్యాంటీన్లలో ప్రస్తుతానికి గత మెనూనే కొనసాగించబోతున్నారు. ప్రభుత్వం నుంచి కొత్త మెనూ ప్రకటించే వరకు దీనినే కొనసాగిస్తారు. రూ.5లకే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం రూ.5కే భోజనం, సాయంత్రం డిన్నర్ కూడా రూ.5కే అందించనున్నారు. ప్రస్తుత మెనూ ప్రకారం సోమవారం ఉదయం ఇడ్లీ, చట్నీ/పొడి, సాంబర్ లేదా పూరి కుర్మా అందిస్తారు. మధ్యాహ్న భోజనంలో అన్నం కూర, పప్పు/సాంబార్, పెరుగు, పచ్చడి అందిస్తారు. భోజనం విషయంలో సోమవారం నుంచి శనివారం వరకు ఒకే మెనూ ఉంటుంది. అల్పాహారం విషయానికి వస్తే మంగళవారం ఉదయం ఉదయం ఇడ్లీ, చట్నీ/పొడి, సాంబార్ లేదా ఉప్మా, చట్నీ/పొడి, సాంబార్, మిక్చర్, బుధవారం ఇడ్లీ, చట్నీ/పొడి, సాంబార్ లేదా పొంగల్, చట్నీ/పొడి, సాంబార్, మిక్చర్, గురువారం ఇడ్లీ, చట్నీ/పొడి, సాంబార్ లేదా పూరి కుర్మా, శుక్రవారం ఇడ్లీ, చట్నీ/పొడి, సాంబార్ లేదా ఉప్మా, చట్నీ/పొడి, సాంబార్, మిక్చర్, శనివారం ఇడ్లీ, చట్నీ/పొడి, సాంబార్ లేదా పొంగల్, చట్నీ/పొడి, సాంబార్, మిక్చర్‌ను అందిస్తారు. ప్రతిరోజు ఉదయం అల్పాహారాన్ని 7:30 నుంచి 10 గంటల మధ్య భోజనం మధ్యాహ్నం 12:30 నుంచి 3 గంటల మధ్య డిన్నర్ రాత్రి 7:30 నుంచి 9 గంటల మధ్య అందిస్తారు. ప్రతీ ఆదివారం స్పెషల్ రైస్ అందిస్తారు. అల్పాహారం మూడు ఇడ్లీ, ఉప్మా పొంగల్, భోజనంలో వైట్‌రైస్, కూర, పప్పు లేదా సాంబారు, పచ్చడి, పెరుగు వంటిని నిర్దిత గ్రాముల్లో అందిస్తారు.





బేటా బచావో బేటీ పడావో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డి, కలెక్టర్ ప్రశాంతి.. సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

బాలికను రక్షిద్దాం.. బాలికను చదివిద్దాం!

మహిళా గౌరవం ఉన్న సమాజంతోనే ఆర్థిక పురోభివృద్ధి సాధ్యం

బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో ఎంపీ పురందేశ్వరి పిలుపు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 14: మహిళలను గౌరవించడం ఇంటి నుంచే ప్రారంభం కావాలని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బాలికను రక్షిద్దాం, బాలికను చదివిద్దాం అనేది ప్రతి ఒక్కరి నినాదం కావాలని కోరారు. బుధవారం రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో జిల్లా స్థాయిలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పురందేశ్వరి మాట్లాడుతూ మహిళా గౌరవం ఉన్న సమాజం ఆర్థిక పురోభివృద్ధి చెందుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంరక్షణ కోసం పీసీపీఎన్‌డీటీ చట్టం, వరకట్న నిషేధం, గృహ హింస చట్టం వంటి అనేక పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ఐసీడీఎస్, ఆశ వర్కర్లు చేస్తున్న సేవలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లల శాతం రోజు రోజుకూ తగ్గిపోతున్నదని, ఆడపిల్లల జననాల శాతాన్ని పెంచేందుకు చట్టపరమైన నియమాలు పాటించాలని అన్నారు. చిన్నపిల్లలు, స్త్రీలపై నమోదవుతున్న కేసుల విషయంలో పోలీసుశాఖ చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుని క్రైం రేటు తగ్గే విధంగా కృషి చేయాలని సూచించారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ స్త్రీలను గౌరవించడం అనేది మన ఇంటి ఇద్ద నుంచే ప్రారంభించాలన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళలకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ మాట్లాడుతూ ఆడపిల్లలేని ఇల్లు పువ్వులేని కొమ్మతో సమానమని అన్నారు. ఈ సందర్భంగా పలువురు గర్భిణులకు ప్రజాప్రతినిధులు, అధికారులు చీర, గాజులు అందించి సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీఎస్ మూర్తి, డీఈవో వాసుదేవరావు, స్టేట్ చైల్డ్ రైట్స్ కమిషన్ మెంబర్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గోకవరం హైస్కూల్‌లో భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి.. గోకవరంలో ఆకస్మిక తనిఖీలు

గోకవరం, ఆగస్టు 14: విద్యార్థులకు నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి నిర్వాహకులకు సూచించారు. గోకవరంలో బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక అధికారులెవ్వరికీ సమాచారం లేకుండానే గోకవరం చేరుకొని పాఠశాలలను, ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేశారు. ముందుగా ప్రభుత్వాసుపత్రిని సందర్శించి అక్కడ అందిస్తున్న వైద్యం తీరును వైద్యులతోపాటు, రోగుల నుంచి ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలను, తంటికొండ గ్రామంలోని ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేశారు. వంటశాల వద్దకు వెళ్లి మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించారు. భోజనం సక్రమంగా ఉడికిందీ లేనిదీ మెతుకులను నోట్లో వేసుకొని పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల వివరాలను కూడా రాబట్టారు. పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. కాగా కలెక్టర్ ఆకస్మిక మండల పర్యటన అధికారులను పరుగులు పెట్టించింది.


సామర్లకోటలో మువ్వన్నెల జెండాలతో బాలుడు


కాకినాడ కలెక్టరేట్‌లో విద్యుద్దీపాలంకరణలో గాంధీజీ విగ్రహం

మొక్కలతో ఆకట్టుకుంటున్న
స్వాతంత్ర్య దినోత్సవం కూర్పు

● గ్లోరీ ఇండియా పేరుతో శుభాకాంక్షలు

కడియం ఆగస్టు 14 : కడియం పల్ల వెంకన్న నర్సరీలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నర్సరీ రైతులు మొక్కలతో గ్లోరీ ఇండియా పేరుతో శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీయేట వినూత్నంగా మొక్కలతో ఇక్కడ శుభాకాంక్షలు తెలుపుతారు. ఇందులో భాగంగా బుధవారం నర్సరీలో వినూత్నంగా మొక్కలతో అలంకరించి దేశాభిమానాన్ని చాటుకున్నారు.



స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ మొక్కలతో నర్సరీ రైతులు ఏర్పాటు చేసిన కూర్పు

పెద్దాపురంలో మహాత్ముడి తీపిగుర్తులు

మహాత్మాగాంధీ ఒక రోజు బస చేసిన ముప్పనవారి బంగ్లా



పెద్దాపురం, ఆగస్టు 14: పెద్దాపురంలో జాతిపిత మహాత్మాగాంధీ తీపిగుర్తులు ఉన్నాయి. మహాత్ముడు పట్టణంలో రెండు ప్రాంతాలను సందర్శించినట్లు పలువురు చెబుతున్నారు. దీంట్లో పట్టణంలో ఉన్న మెయిన్‌రోడ్డు కాగా, రెండవది ముప్పనవారి బంగ్లా అని చెప్పవచ్చు. 1942లో కాకినాడలో జరిగిన కాంగ్రెస్ మహాసభలకు ఆయన వచ్చినప్పుడు పెద్దాపురం పట్టణాన్ని మహాత్ముడు సందర్శించారు. డైలీమార్కెట్, మెయిన్‌రోడ్డు మధ్యలో ఉన్న సెంటర్‌లో ఆయన కాంగ్రెస్ నాయకులనుద్దేశించి ప్రసంగం చేశారు. అప్పటినుంచి ఆసెంటర్‌ను గాంధీ బొమ్మ సెంటర్ అని పిలుస్తారు. అలాగే మహాసభ ముగిసిన అనంతరం ఆయన ముప్పన వారి బంగ్లాలో ఆరోజు రాత్రి బసచేశారని పెద్దలు చెబుతున్నారు.

స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తికి ఊతమిచ్చిన దేవులపల్లి గేయం


దేవులపల్లి కృష్ణ శాస్త్రి

సామర్లకోట, ఆగస్టు14: స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తికి నాడు దేశవ్యాప్తంగా ఎంతో ఊతమిచ్చిన గేయం దేవులపల్లి కృష్ణశాస్త్రి రచించిన జయజయ ప్రియ భారత జనయిత్రి దివ్యధాత్రి నేటి తరానికి కూడా ఎంతో స్ఫూర్తిదాయకం కావడం విశేషం. ఈగేయ రచయిత దేవులపల్లిది ఆంధ్రప్రదేశ్‌లోని ఉమ్మడి తూర్పుగోదా వరిజిల్లా సామర్లకోట మండలం రావువారి చంద్రంపాలెం కావడంతో ఈ ప్రాంతానికి ఎంతో ప్రాధాన్యం సంతరించుకోవడం విశేషం. దేవులపల్లి కృష్ణశాస్త్రి జన్మస్థలం కాకినాడజిల్లా సామర్లకోట మండలం రావువారి చంద్రంపాలెం కాగా, కాకినాడ పీఆర్ కళాశాలలో ఉన్న త విద్యాభ్యాసంచేసి తొలిసారిగా పెద్దాపురం లూథరన్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా 1919లో చేరారు. 1945లో సినీరంగంలో ప్రవేశించిన దేవులపల్లి స్వాతంత్ర్య పోరాటయోధులను మరింత ఉత్తేజితులను చేసేందుకు గానూ జయజయ ప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రి అనే గేయం రచించగా అప్పట్లోనే ఈ గేయం ఎంతో పాపులా రిటీ సాధించింది. 1986లో చిరంజీవి నటించిన రాక్షసుడు సినిమాలో ఇదే గేయాన్ని తిరిగి తెరకెక్కించడం ద్వారా దేవులపల్లి గేయం మరోసారి ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం ఏర్పరుచుకుంది..


కపిలేశ్వరపురం: అంగరలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం ఆకారంలో ఏర్పడిన విద్యార్థులు



దివాన్ చెరువు: నామవరంలో భారతదేశం ఆకృతిలో నిల్చున్న ఓ పాఠశాల విద్యార్థులు


వాడపల్లిలో స్వాతంత్ర్య పోరాటయోధుల స్థూపం

వాడపల్లిలో స్వరాజ్య స్ఫూర్తి

ఆత్రేయపురం, ఆగస్టు 14: దైవభక్తి, దేశభక్తి చాటిన నేలగా వాడపల్లి వాడని మల్లెగా విరజిల్లుతోంది. 1931 మార్చి 30 ఏకాదశి రోజున శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం, రథోత్సవం నిర్వహిస్తున్నారు. రథంపై బాపూజీ చిత్రపటాన్ని, స్వరాజ్య జెండాను దేశభక్తులు ఎగురవేశారు. బ్రిటీష్ డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్ ముస్తాఫ్ ఆలీఖాన్ రథోత్సవం వద్దకు వచ్చి గాంధీ చిత్రపటాన్ని, మువ్వన్నెల జెండాను తొలగించాలని ఆదేశించారు. దేశభక్తులు ససేమిరా అనడంతో లాఠీ చార్జ్‌చేసి తుపాకీ కాల్పులు జరిపారు. నలుగురు పోరాటయోధులు అమరులయ్యారు. వందలాది మంది గాయపడగా మరికొంత మందిని జైళ్లలో బంధించారు. నాటి పోరాటంలో దేశభక్తులు కోపోద్రిక్తులై బ్రిటీష్ పాలకులపై తిరగపడగా పలాయనం చిత్తగించారు. దేశభక్తితో పాటు దైవభక్తిగా చాటుకున్న నేలగా వాడపల్లి చరిత్రకెక్కింది. ఈ పోరాట స్ఫూర్తి భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలనే మంచి ఉద్దేశంతో రాజకీయ దురంధరుడు, గాంధేయవాది, మాజీ ఎమ్మెల్యే మంతెన వెంకట సూర్యసుబ్బరాజు వాడపల్లి క్షేత్రం ఎదురుగా స్మారక స్థూపాన్ని నిర్మించారు. స్వామివారి కల్యాణం, రథోత్సవం తిలకించ డానికి వచ్చే లక్షలాది మంది భక్తులు అమరులకు నివాళులర్పిస్తూ చరిత్ర తెలుసుకుంటున్నారు. స్వా తంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగురవేసేందుకు ఈ స్థూపాన్ని ముస్తాబు చేస్తున్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ర్యాలి గ్రామం ఎంతో ప్రత్యేకత చాటుకుంది. 1929లో విదేశీ వస్తు బహిష్కరణపై పోరాటం సాగిస్తున్నారు. అందులో భాగంగా గాంధీజీ ర్యాలి గ్రామాన్ని సందర్శించారు. వేల సంఖ్యలో దేశభక్తులు బాపూజీ వెంట నడిచారు. గాంధీ ర్యాలి వచ్చిన సందర్భంగా 1953లో జగన్మోహినీ కేశవస్వామి గుడి వీధిలో దివంగత పి.సురపరాజు గాంధీ విగ్రహాన్ని నెలకొల్పారు.


ర్యాలి గాంధీ వచ్చిన సందర్భంగా నిర్మించిన మహాత్ముని విగ్రహం


ఎటపాకలో 212 బెటాలియన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

212 బెటాలియన్ ఆధ్వర్యంలో ర్యాలీ

ఎటపాక, ఆగస్టు 14: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎటపాకలో 212 బెటాలియన్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలతో సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఎటపాక సీఆర్‌పీఎఫ్ క్యాంపు నుంచి ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం ప్రబాత్ భేరీ నిర్వహించారు. జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో కమాండెంట్ దిపక్ కుమార్ పాల్గొన్నారు.


ఆలయంలో ఏర్పాటుచేసిన ఫొటో షూట్, ఆలయ ముఖ మండపంలో ఫల, పుష్పాలతో అలంకరణ

వైభవంగా వాడపల్లి వెంకన్న పవిత్రోత్సవాలు

● ఫల, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ
● ఆగమ శాస్త్రం ప్రకారం ప్రత్యేక పూజలు
● గోవింద నామస్మరణతో మార్మోగిన ఆలయం

ఆత్రేయపురం, ఆగస్టు 14:వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు పవిత్రోత్సవాలను మేళతాళ మంగళవాయిద్యాలు, వేదమంత్రాల సాక్షిగా తీసుకొచ్చారు. వివిధ రాష్ట్రాలకు చెందిన నిపుణుల ఆధ్వర్యంలో ఫల, పుష్ప అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. వసంత మండపంలో కొలువుదీరిన ఉత్సవమూర్తులకు తొలిరోజును విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరుణ, దీక్షాధారణ, అకల్మష హోమం, సాయంత్రం అంకురార్పణ, వాస్తు పూజ, అగ్నిమథనం, ప్రతిష్ఠాపన, వాస్తుహోమాలను వైభవంగా నిర్వహించారు. ఉప కమిషనర్, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ పవిత్రోత్సవాల్లో పాల్గొన్నారు. వివిధ రకాల పుష్పాలతో నెమలి అలంకరణలో ఫొటో షూట్‌వద్ద భక్తులు సందడి చేశారు.


స్వామివారి పవిత్రోత్సవాల్లో ఉప కమిషనరు పూజలు

వేర్వేరు కేసుల్లో 104 కేజీల గంజాయి స్వాధీనం

● ఐదుగురు నిందితుల అరెస్టు

చింతూరు, ఆగస్టు 14: రెండు వేర్వేరు కేసుల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు, మోతుగూడెం పోలీసులు 104 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుల్లో ఐదుగురు నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపించారు. చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా ఈమేరకు బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. అల్లూరి సీతారామరాజుజిల్లా జీకే వీధి మండలం వలసగడ్డకు చెందిన మజ్జి గిన్ను, కోయిలంగి ధనరాజులు ఇరువురు కలసి వారి ఆటోలో 100 కేజీల గంజాయిని వయా మోతుగూడెం మీదుగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు తరలించేయత్నం చేశారు. మోతుగూడెం పోలీసులు పోలీసుస్టేషను పరిధిలో వాహన తనిఖీలు చేస్తుండగా గంజాయితోపాటు వారిద్దరు పట్టుబడ్డారు. గంజాయి తరలింపున కు పైలట్‌గా వ్యవహరించిన మజ్జి కృపానంద పరారయ్యాడు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మంనకు చెందిన కుమార్‌కు నిందితులు గంజాయి చేరవేసే ఒప్పందం కుదుర్చుకున్నట్లు తమ విచారణలో వెల్లడైందని ఏఎస్పీ తెలిపారు. ఇదిలావుండగా అస్సాంకు చెందిన ధృబజ్యోతి కోన్వార్, మణేశ్వరి నార్జారి, గోబిన్ బోనియాలు రెండు ద్విచక్ర వాహనాలపై చింతూరు మీదుగా భద్రాచలంవైపు వెళుతుండగా చింతూరు పోలీసులు పోలీసుస్టేషన్ పరిధిలో వారిని నిలువరించి వాహన తనిఖీలు చేశారు. దీంతో ద్విచక్ర వాహనాలకు చెందిన సీట్ల కింది 4 కేజీల గంజాయి బయటపడిందన్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మొత్తంమీద ఈ రెండు కేసుల్లో ఐదుగురు నిందితులను ఒక ఆటో, రెండు మోటారు సైకిళ్లు, 104 కేజీల గంజాయి స్వాధీనం చేసుకు న్నామన్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.5,20,000 ఉంటుందన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపించామన్నారు. కార్యక్ర మంలో చింతూరు సీఐ గజేంద్రకుమార్, మోతుగూడెం ఎస్‌ఐ గోపాలరావు సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు తెలియజేస్తున్న అల్లూరి జిల్లా చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా


మట్టా రాంబాబు

మలేషియాలో కోనసీమ వాసి కష్టాలు

ఆత్రేయపురం, ఆగస్టు 14: అప్పులు చేసి కుటుంబాన్ని ఉన్నత స్థానంలో ఉంచాలనే ఉద్దేశంతో మలేషియా వెళ్లి అక్కడ కష్టాలు పడుతున్న కోనసీమ వాసి గాథ ఇది... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ఆత్రేయపురం మండలం నార్కెడిమిల్లికి చెందిన మట్టా రాంబాబు కుటుంబాన్ని పోషించుకునేందుకు మూడునెలల క్రితం మలేషియా వెళ్లాడు. ఏజెంటు ద్వారా రూ2.50 లక్షలు ఖర్చుచేసి వెళ్లిన రాంబాబు అక్కడ విశ్రాంతి లేకుండా 12 గంటలు పనిచేయించడంతో ఒత్తిడికిగురై ఎన్నో ఇబ్బందులు పడుతున్నాడు. అక్కడ ఓ రెస్టారెంట్‌లో పనిచేస్తున్న అతడు పనిఒత్తిడి అధికంగా ఉందని యజమానులను ప్రశ్నిస్తున్నా పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నా డు. రాంబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలను బాగా చదివించి మంచి గృహం నిర్మించాలనే ఆశతో మలేషియా వెళ్లానని... అక్కడ ఎన్నో ఇబ్బందులు పడుతున్న తనను స్వగ్రామానికి తీసుకురావాలంటూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు సోషల్‌మీడియా ద్వారా సందేశాన్ని పంపించాడు. తనను ఇండియాకు పంపించాలని యజమానిని కోరగా తిరిగి డబ్బులు కట్టి వెళ్లు అంటూ బెదిరస్తున్నాడని వాపోయాడు. తనకు ఆర్థిక స్తోమతలేదని కూటమి ప్రభుత్వం తనను రప్పించాలని కోరుతూ వాట్సాప్‌లో పెట్టిన సందేశం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఎట్టకేలకు బయటపడిన నావ

● నీట మునిగిన డ్రెడ్జింగ్ నావను వెలికితీసిన యజమాని

ధవళేశ్వరం, ఆగస్టు 14: కాటన్ బ్యారేజ్ మొదటి గేటు వద్ద నీట మునిగిన డ్రెడ్జింగ్ నావను ఎట్టకేలకు నీటి నుంచి బయటకు తీశారు. నీట మునిగిన నావను 23 రోజులుగా బయటకు తీయకపోవడంపై కలెక్టర్ పి.ప్రశాంతి ఇరిగేషన్ అధికారులకు క్లాస్ తీసుకోవడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. డెల్టా సీఈ ఎన్.పుల్లారావు, ఎస్ఈ శ్రీనివాసరావు రంగంలోకి దిగి మునిగిన నావను వెంట నే బయటకు తీయాలంటూ నావ సొంత దారుడుకి అల్టిమేటం జారీ చేయడంతో తగు విధంగా సహకరించి పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం నావలో మేటవేసిన ఒండ్రు, ఇసుకను తొలగించారు. బుధవారం ఉదయం నుంచి కప్పీలు, క్రైన్‌ల సహాయంతో ప్రయత్నించడంతో నీట మునిగిన నావ నీటి నుంచి బయటకు వచ్చింది. దీంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. బ్యారేజ్ గేట్లను ఆపరేట్‌చేసి నీటి విడుదలను నియంత్రించనున్నారు.


నీటిపై తేలియాడుతున్న డ్రెడ్జింగ్‌నావ

బిక్కవోలులో లక్ష్మీగణపతి చవితి ఉత్సవాలకు శ్రీకారం

బిక్కవోలు, ఆగస్టు 14: రాష్ట్ర వ్యాప్తంగా పేరొందిన బిక్కవోలు శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో వచ్చేనెల 7న నిర్వహించే చవితి ఉత్సవాలకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన సతీమణి మహాలక్ష్మితో కలసి పందిరి రాట వేసి ఉత్సవ పనులను ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే దంపతులు లక్ష్మీగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, చాగంటి సాయి బాబారెడ్డి, గొర్రెల త్రిమూర్తులు, సింగారపు రామారావు, గుణ్ణం రమేష్, రాయుడు రామచంద్రరావు, లారీ యూనియన్ సభ్యులు, ఎఫ్‌సీఐ జట్టు కార్మికులు, ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ పాల్గొన్నారు.


బిక్కవోలులో పందిరిరాట వేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు



కొండల నడుమ సూర్యాస్తమయం

అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం ఫోర్‌బై డ్యాంవద్ద బుధవారం కొండల నడమ సూర్యాస్తమయ సమయంలో బంగారువర్ణంతో సూర్యకిరణాలు మిరిమిట్లుగొలుపాయి. ఈ సుందర దృశ్యం ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులను ఆకట్టుకుంది. ఈ చిత్రాన్ని పర్యాటకులు సెల్‌ఫోన్లలో బంధించేందుకు ఎగబడ్డారు.

\- మోతుగూడెం

ప్రియురాలికి వివాహమైందని
ప్రియుడి ఆత్మహత్య

కరప, ఆగస్టు 14: ప్రియురాలికి వివాహమైందని తెలిసి ఆమె ప్రియుడు ఆత్మహత్య చేసుకున్నట్లు కరప పోలీసులు తెలిపారు. కాకినాడ జిల్లా కరపమండలం జడ్.బావారం గ్రామానికి చెందిన పలివెల విజయ కుమార్(22) ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. మూడేళ్ల క్రితం పెద్దాపురానికి చెందిన ఒక యువతి అతని ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో ఇద్దరికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమకు దారితీసి పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. ఆ యువతికి 4రోజుల క్రితం వేరొక వ్యక్తితో వివాహమైనట్టు తెలిసింది. దీంతో తట్టుకోలేని విజయకుమార్ జీవితంపై విరక్తితో ఈనెల 13న గడ్డి మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. కుటుంబసభ్యులు అతన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. దీనిపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ తూపాటి రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తూర్పుగోదావరి

ఏజెన్సీ సమాచారం

ముగిసిన సర్పంచ్‌ల శిక్షణా తరగతులు



సర్పంచ్‌ల ముగింపు శిక్షణా కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యదర్శులతో ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం, ఆగస్టు 14: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 12 నుంచి జరుగుతున్న సర్పంచ్‌లు శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ఆఖరిరోజున సర్పంచ్‌లకు గ్రామాల్లోని వీధి దీపాల ఏర్పాట్లు నిర్వహణ, గ్రామ పంచాయతీల 2024-25కి సంబంధించి అభివృద్ధి ప్రణాళికలు, పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణపై సూచనలు చేశారు. సర్పంచ్‌లు తమ విధులను బాధ్యతా యుతంగా నిర్వహించాలని ఎంపీడీవో బాపన్నదొర కోరారు. శిక్షణలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఈవోపీఆర్డీ శివకుమార్ పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడిగా చిన్నిబాబు

అల్లూరి జిల్లా వై.రామవరం మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడిగా కోట పంచాయతీ సర్పంచ్ గరుజుల చిన్నిబాబును ఎన్నుకున్నట్లు 17 పంచాయతీల సర్పంచ్‌లు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా బొడ్డంగడి సర్పంచ్ వే మా సంధ్యారాణి, కార్యదర్శిగా చామగడ్డ సర్పంచ్ జర్తా కృష్ణారెడ్డి, జాయింట్ సెక్రటరీ పనసలపాలెం సర్పంచ్ రేలుపల్లి నరసింహమూర్తి, కోశాధికారిగా గుర్తేడు సర్పంచ్ గొర్లె దుశ్యంతుడును ఎన్నుకున్నట్లు తెలిపారు.

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

రాజవొమ్మంగి, ఆగస్టు 14: మండలంలోని 19పంచాయతీల సర్పంచ్‌లకు, కార్యదర్శులకు పంచాయతీల అభివృద్ధి, చట్టాలు తదితర అంశాలపై రాజవొమ్మంగి ఎంపీడీవో కార్యాలయంలో మూడు రోజులపాటు అవగాహన కల్పించారు. ఎంపీడీవో యాదగిరేశ్వరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాస్‌లు మూడు రోజుల శిక్షణలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు జీవోలు, పంచాయతీ విధులు-బాధ్యతలు, శానిటేషన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

'చెత్త సేకరణ కేంద్రంలో పనిచేసే వారికి జీతం పెంచాలి'

గతంలో చెత్త సేకరణ కేంద్రాలు నిర్మించిన ప్రస్తుతం వాటిని పునరుద్ధరించేందుకు చెత్తసేకరణ కేంద్రాలలో పనిచేసే వారికి జీతాలు పెంచాలని మండల సర్పంచ్‌ల సమాఖ్య సభ్యులు బుధవారం ఎంపీడీవో యాదగిరేశ్వరావుకు వినతిపత్రం అందజేశారు. చెత్తసేకరణ కేంద్రాలలో పనిచేసే వారికి జీతాలు పెంచి, వారికి ఉద్యోగం పర్మినెంటు చేస్తేనే చెత్తసేకరణ కేంద్రాలలో పనిచేసే వారికి బాధ్యత ఉంటుందంటూ వారు పేర్కొన్నారు. సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కొంగర మురళీకృష్ణ, తదితరులు ఉన్నారు.

రేషన్‌సరుకులు సకాలంలో అందజేయాలని వినతి



తహశీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న ఎంపీటీసీ

రంపచోడవరం, ఆగస్టు 14: డీఆర్ డీ పోలలో రేషన్ సరుకులు లబ్ధిదారులకు సకాలంలో అందజేయాలని ఎంపీటీసీ సభ్యుడు వంశీ కుంజం అన్నారు. ఈ మేరకు బుధవారం తహశీల్దారు కృష్ణ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. మండలంలోని తామరపల్లి, ముసురుమిల్లి పంచాయతీలలో పప్పులు, పంచదార గత కొన్ని నెలలుగా లబ్ధిదారులు అందడంలేదన్నారు. తహశీల్దారు దీనిపై స్పందిస్తూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు.

రాజ్‌భవన్ స్వాతంత్ర్య వేడుకలకు అభిచర్ల సర్పంచ్‌కు ఆహ్వానం



అభిచర్ల సర్పంచ్ కారం రాణి

కూనవరం, ఆగస్టు 11: మండలంలోని అభిచర్ల పంచాయతీకి చెందిన కారం రాణికి రాష్ట్ర రాజ్‌భవన్‌ను స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానం అందింది. స్వాతంత్ర్య వేడుకలకు రావాల్సి ఉండగా గవర్నర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. దీంతో ఆగస్టు 15న జరిగే రాష్ట్ర స్వాతంత్ర్య వేడుకల్లో రాణి పాల్గొన నుంది. సర్పంచ్‌గా రాణి ప్రజల మన్ననలు పొందింది. సర్పంచ్ పరిధిలో మొక్కలు నాటడం, వరద బాధితులను ఆదుకోవడంలో పేరుంది. పంచాయతీలోని నిరుపేదలకు ఎవరికైనా అనారోగ్యంవస్తే ఆమె సొంతఖర్చులు భరించి ఆసుపత్రికి పంపిస్తోంది. ఈసేవలను గుర్తించి వేడుకలకు ఆహ్వా నం అందింది. టీడీపీ అరకుపార్లమెంటు ప్రతినిధి ఎడవిల్లి భాస్కరరావు హర్షం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల సహాయం



విద్యార్థులకు సమకూర్చిన బెంచీలు

మోతుగూడెం, ఆగస్టు 14: డొంకరాయి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో గతంలో విద్యాబుద్ధులు నేర్చుకున్న పూర్వవిద్యార్థులు పాఠశాల మౌలిక వసతులు గుర్తించి ప్రతి సంవత్సరం తమవంతు సహాయంగా అందిస్తున్నారు. గత సంవత్సరం రూ.2లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం, రూ.1లక్షతో వాటర్ ట్యాంకులు నిర్మించారు. ఈ సంవత్సరం రూ.2లక్షలతో పిల్లలు కూర్చునేందుకు బెంచ్‌లను అందించారు.

● ఎంపీటీసీ కరక రమణ దాతృత్వం

పాఠశాలలో చదివి ప్రస్తుతం డొంకరాయి గ్రామానికి టీడీపీ ఎంపీటీసీగా సేవలందిస్తున్న కరకా వెంకటరమణ ఈ పాఠశాలకు టీచర్ల కొరత ఉందని తెలుసుకుని ప్రతినెలా రూ.25వేలు చొప్పున చెల్లించి ఐదుగురు వలంటీర్లను నియమించారు. డొంకరాయి పాఠశాల హెచ్‌ఎం బి.ప్రవీణ్‌నాయక్ అభినందిస్తూ వీరిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

వరద బాధిత కుటుంబాలకు సాయం అందజేత



వరద బాధిత కుటుంబీకులకు సాయం అందిస్తున్న దాతలు

కూనవరం, ఆగస్టు 14: మండలంలోని శబరికొత్తగూడెంలోని 45 వరద బాధిత కుటుంబాలకు కూనవరంనకు చెందిన కొమ్మాని పవన్, హైదరాబాద్‌కు చెందిన వారి స్నే హితులు బుధవారం సా యం అందజేశారు. బాధితులకు నిత్యావసర వస్తువులు, బియ్యం, కూరగాయలు అందజేశారు.

దేశానికి పూర్తి స్వాతంత్ర్యం రాలేదు

● పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్



సదస్సులో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్

రంపచోడవరం, ఆగస్టు 14: దేశంలో పేదలు, గిరిజనులు, దళితులు, కష్టజీవులకు ఇంకా స్వాతంత్ర్యం రాలేదని, భూస్వాములు, పెట్టుబడిదారులకు మాత్రమే స్వాతంత్ర్యం వచ్చిందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక మార్క్స్-ఎంగెల్స్ భవనంలో పీడీఎస్‌యూ, పీవైఎల్, పీవోడబ్ల్యు, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులు దేశాన్ని వదిలివెళ్లిపోయిన పరోక్షంగా, ప్రత్యక్షంగా విదేశీయులు పరిపాలిస్తున్నారని తద్వారా దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నారన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, కొమరంభీం, మల్లుదొర, గాటందొర స్ఫూర్తితో ఆదివాసీలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు పల్లాల లచ్చిరెడ్డి, కె.దూలయ్య, ఐ.రమణ, పి.అశోక్, కె.బాలురెడ్డి, పి.అనసూయ, పి.ధర్మారెడ్డి, వి.రామారావు, ఎస్.చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యం

▸▸ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి.. పలుచోట్ల హర్ ఘర్ తిరంగా



అనపర్తిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఆగస్టు 14: ప్రతి పౌరుడిలోను దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ప్రధాని మోదీ హర్ ఘర్ తిరంగా కార్యక్రమం రూపొందించి ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేశారని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అనపర్తిలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా గాంధీబొమ్మ సెంటర్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే మెయిన్‌రోడ్డులోని వర్తకులకు జాతీయ జెండాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం నుంచి దేవీచౌక్ వరకు జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం దేవీచౌక్ వద్ద కెనాల్ రోడ్డుపై మానవహారంగా ఏర్పడి ప్రసంగించారు. దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలన్నారు. కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి రామవరం సర్పంచ్ గిరిడా గంగాభవాని, కుతుకులూరు సర్పంచ్ గొల్లు హేమతులసి, ఈవోపీఆర్డీ పద్మజ పాల్గొన్నారు.

ధవళేశ్వరం: బీజేపీ యువ మోర్చ రాష్ట్ర కార్యదర్శి కందుకూరి మనోజ్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు గ్రామంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. దీనికి పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి వివిధ పార్టీల నాయకులు, సీఐ గణేష్, అధికారులు త్రివర్ణపతాకాన్ని చేతబూని గ్రామంలోని ప్రధాన రహదారి మీదుగా సాయిబాబా గుడి వరకు ర్యాలీ చేపట్టారు. బాలికోన్నత పాఠశాల విద్యార్థులు భారీ జాతీయ జెండాను ఈ ర్యాలీలో ప్రదర్శించారు. కార్యక్రమంలో నాయకులు పిన్నంటి ఏకబాబు, మచ్చేటి శివసత్యప్రసాద్, తలారి మూర్తి, ఆళ్ల ఆనందరావు, నాళ్ల రమేష్, ఆకుల శ్రీధర్, యానాపు ఏసు, గుర్రాల వెంకట్రావు, ఒంటెద్దు స్వామి, షేక్ షాజిత్ పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: నామవరంలోని భారతీయ విద్యా భవన్స్‌లో ముందస్తు స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు భారతదేశ ఆకృతిలో నిలబడి జాతీయ పతాక రంగులను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ వీరేంద్రనాథ్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన వీరులను, వారి త్యాగాలను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజానగరం: రాజానగరంలో 300 అడుగుల భారీ జాతీయ జెండాతో అధికారులు, విద్యా ర్థులు కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగా సిద్ధించిన దేశ స్వాతంత్ర్య ఫలాలను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అందరూ ఇంటింటా జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. తొలుత స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని గాం ధీజీ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాలతో ప్రదర్శ నగా గాంధీ బొమ్మ సెంటర్‌కు చేరుకుని దేశ ఔన్నత్యాన్ని చాటిచెప్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రంగంపేట: మండలంలోని వడిశలేరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దాట్ల అరుణ అధ్యక్షతన కూటమి నాయకుల ఆధ్వర్యంలో విద్యార్థులు, అధికారులతో ర్యాలీ నిర్వహించారు. దీనికి టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చావ శ్రీనివాస్, నిమ్మలపూడి కాటన్‌దొర, గణేష్, ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రవరంలోని బీసీ బాలుర వసతి గృహాల సముదాయంలో జరిగిన హర్ ఘర్ తిరంగాలో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా బీసీ సంక్షేమాధికారిణి శశాంక విద్యార్థులతో కలసి పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ విశిష్టతను, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను విద్యార్థులకు వివరించారు. ఏబీసీ డబ్ల్యువో పి.సత్యరమేష్, హెచ్‌డబ్ల్యువో ముత్యాల సుబ్బారావు, జిల్లా కార్యాలయ, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

కోరుకొండ: గాదరాడలో జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు జాతీయ పతాకాలు, నాయకుల చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిపైన జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ విగ్రహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, శివశంకర్, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి గట్టున హర్ ఘర్ తిరంగా

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 14: స్థానిక గోదావరి బండ్ పుష్కరాల రేవు వెలుపల బుధవారం సాయంత్రం ఆనందోత్సాహాల నడుమ హర్ ఘర్ తిరంగా కార్యక్రమం జరిగింది. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి మువ్వన్నెల బెలూన్స్‌ను గాలిలోకి వదిలి, శాంతి కపోతాలను గాలిలో ఎగురవేసి ర్యాలీ చేశారు. ప్రధాని మోదీ పిలుపులో భాగంగా హర్ ఘర్ తిరంగా నిర్వహించుకుంటున్నామని, ఇది ప్రతీ భారతీయుడిలో దేశభక్తిని పెంపొందిస్తుందని వారన్నారు. ఈ ర్యాలీ పుష్కరాలరేవు నుంచి గోదావరి బండ్‌పై జ్యోతిరావు పూలే విగ్రహం వరకు సాగింది. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, అధ్యక్షుడు వై.శ్రీను. కాశి నవీన్‌కుమార్, రెడ్డి మణి, యిన్నమూరి దీపు, హారిక, కోసూరి చండీప్రియ, కప్పల వెలుగుకుమారి పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అనపర్తి, ఆగస్టు 14: అనపర్తి శివారు కొత్తూరులోని బీఆర్ అంబేడ్కర్ సెంటినరీ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో జూనియర్ ఇంటర్ బైపీసీ ఇంగ్లీషు మీడియంలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.సత్యనారాయణ తెలిపారు. 2024 మార్చి నెలలో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులని చెప్పారు. లక్ష లోపు వార్షిక ఆదాయం, తెల్లరేషన్ కార్డు ఉండి, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 20న నేరుగా సర్టిఫికెట్లతో కళాశాలకు వచ్చి ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

దంత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

అనపర్తి, ఆగస్టు 14: రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా దంత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీఎస్ఎల్ వైద్య కళాశాల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు అన్నారు. బుధవారం స్థానిక ఎన్డీయే కార్యాలయంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో గన్ని మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటిగా అనపర్తి మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టామని ప్రతి ఇంటికి వెళ్లి దంత సమస్యలను గుర్తిస్తున్నామని చెప్పారు.

రైల్వేస్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన ఎంపీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి, గోదావరి రైల్వే స్టేషన్లను ఎంపీ పురందేశ్వరి ఆకస్మికంగా సందర్శించారు. ఇటీవల ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించి పలు మార్పులు సూచించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తొలగిస్తున్న భవనాలు, వాటి స్థానంలో వచ్చే కొత్త భవనాలపై ఆరా తీశారు. నిరుప యోగంగా ఉన్న గూడ్స్ షెడ్‌ని కడియం లేదా కొవ్వూరుకు తరలిస్తే ఈ ప్రదేశాన్ని ప్లాట్‌ఫాంలు వచ్చే విధంగా తీర్చిదిద్దవచ్చని యోచిస్తున్నారు. అలాగే అమృత్ భారత్ పథకంలో పూర్తిస్థాయిలో నిధులు రాబట్టి పుష్కరాల నాటికి పనులు ముగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గోదావరి రైల్వేస్టేషన్ అభివృద్ధిపై కూడా దృష్టి సారించారు. స్టేషన్ వెనుకవైపు ఖాళీ స్థలాన్ని ఉపయోగించుకునే విషయంపై అధికారులతో చర్చించారు. ఈ మేరకు రైల్వే కేంద్ర మంత్రికి ఎంపీ వివరించనున్నారు. కార్యక్ర మంలో సీటీఐ చంద్రమౌళి, సీసీఐ కళ్యాణ్, ఐపీఎఫ్ సైదయ్య, ఎస్ఎం రంగనాథ్, గోదావరి రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ అరవ నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

అన్ని రైళ్లకు గోదావరి స్టేషన్‌లో హాల్ట్ ఇవ్వాలని వినతి

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 14: అన్ని రైళ్లకు గోదావరి రైల్వేస్టేషన్‌లో హాల్ట్ ఇవ్వాలని, దాని వల్ల ప్రయాణికులకు సౌలభ్యంగా ఉండడంతోపాటు గోదావరి స్టేషన్ ప్రాముఖ్యత పెరుగుతుందని రాకా సంస్థ విజ్ఞప్తి చేశారు. స్థానిక రాకా సాంస్కృతిక సంస్థ ప్రధాన కార్యదర్శి జీవీ రమణ, కోశాధికారి సూరవరపు తాతారావు.. ఎంపీ పురందేశ్వరిని ఆమె స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంస్కృతిక రాజధానియైన రాజమహేంద్రవరంలో ఆనం కళా కేంద్రం ప్రస్తుతం అద్దె విషయంలో, కళా సంస్థలకు, కళాకారులకు మోయలేని భారంగా ఉందని, ఆ భారాన్ని తగ్గించే విషయంలో అధికారులతో చర్చించాలన్నారు. గోదావరి గట్టుపై ఉన్న బాపూరమణల విగ్రహం ప్రక్కన గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహం ఏర్పాటు చేసే అనుమతి విషయంలో చొరవ తీసుకోవాలని కోరారు. పై విషయాల్లో సానుకూలంగా స్పందించి కృషి చేస్తానని ఎంపీ పురందేశ్వరి తెలిపారని రాకా ప్రతినిధులు చెప్పారు

సీసీఆర్సీ కార్డులతో రుణాల మంజూరుకు కృషి: జేసీ

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు 14: జిల్లాలో కౌలు రైతులకు సీసీఆర్సీ ద్వారా త్వరగా రుణాల మంజూరు చేయడానికి వ్యవసాయ శాఖ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు అన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జేసీని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, జిల్లా సహకార అధికారి శ్రీరాములునాయుడు, జిల్లా ఉద్యాన అధికారి బి.సుజాతకుమారి మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వారితో జేసీ మాట్లాడుతూ ఈ-పంట నమోదును త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో వ్యవసాయ పథకాల అమలుపై జేసీకి మాధవరావు వివరించారు. కార్యక్రమంలో సీతానగరం ఏవో కె.సూర్యరమేష్, రాష్ట్ర ఏఈవోల సంఘం అధ్యక్షుడు డి.వేణుమాధవరావు పాల్గొన్నారు.

పశు సంవర్ధక పరిశ్రమలను వినియోగించుకోవాలి

కేవీకే అధికారి నాగేశ్వరరెడ్డి

రాజానగరం, ఆగస్టు 14: మేక, గొర్రె, కోడి మాంసాల ఉత్పత్తిని పెంచడంతో పాటు గ్రామీణ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధిని కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పశు సంవర్ధక పరిశ్రమలను సద్వినియోగం చేసుకోవాలని కేవీకే అధికారి నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. పశు సంవర్ధక రంగంలో పరిశ్రమల స్థాపనకు కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలపై మండలంలోని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పశుధన మిషన్, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకాలను కేంద్రం అమలు చేస్తోందన్నారు. పశుధన మిషన్ ద్వారా కోడి, గొర్రె, మేక, పంది, పశుగ్రాస పరిశ్రమలను నెలకొల్పేందుకు 50శాతం సబ్సిడీతో గరిష్ఠంగా రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు పొందవచ్చని చెప్పారు. ఈ రెండు పథకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ ఆసక్తి ఉన్న అభ్యర్థులు అవసరమైన అన్ని వివరణాత్మక ప్రాజెక్టు నివేదికల తయారీ కోసం కలవచర్లలోని కేవీకేను సంప్రదించవచ్చని చెప్పారు. దీనిలో భాగంగా ప్రధాన మంత్రి కల్పన కార్యక్రమాల వివరాలతో కూడిన కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో రాజానగరం, కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల నిరుద్యోగ యువత, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి ప్రజాప్రతినిధులకు బ్రహ్మరథం

కడియం ఆగస్టు 14: కడియం మండలంలో కూటమి ప్రజాప్రతినిధులకు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బ్రహ్మరథం పట్టారు. కూటమి నాయకుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిలకు జీఎంఆర్ కన్వెషన్‌లో ఆత్మీయ సత్కారం చేశారు. తొలుత నాయకులు మండలంలో భారీ ర్యాలీ చేశారు. అనంతరం ఊరేగింపుగా ప్రజాప్రతినిధులను జీఎంఆర్‌కు తీసుకొచ్చి వేద మంత్రోచ్చారణలతో స్వాగతం పలికారు. అనంతరం వారిని గజమాలలతోను సత్కరించారు. కడియం ప్రజల అభిమానం మరువలేమని ప్రజాప్రతినిధులు అన్నారు. ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉద్యోగం వదిలేయమని రాజకీయ ఒత్తిళ్లు

అచ్చుతాపురం వీవోఏ వేణు ఆవేదన

గోకవరం, ఆగస్టు 14: సుమారు 30 ఏళ్ల నుంచి వీవోఏ(విలేజ్ అర్గనైజింగ్ అసిస్టెంట్)గా పని చేస్తున్నాని, ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులూ లేవని, భర్త మృతితో తన ఇద్దరు పిల్లల భారం తానే చూసుకుంటున్నానని, తనకు ఆ చిన్నపాటి ఉద్యోగమే ఆధారంమని, కానీ తనపై రాజకీయ కక్ష సాధింపు చర్యలు మొదలయ్యాయి. తనని ఉద్యోగం వదిలి వెళ్లిపోవాలంటూ రాజకీయ నాయకులు ఒత్తిడి చేస్తున్నారని అచ్చుతాపురానికి చెందిన బుర్రే వేణు ఆవేదనను వెలిబుచ్చింది. బుధవారం ఆమె మండల శ్రీశక్తి భవన్ మహిళా సమైక్య కార్యాలయం వద్దకు చేరుకొని అధికారుల వద్ద తన మొరను వెళ్ళగక్కింది. తొలగించడానికి కారణమేమిటని అధికారులను నిలదీసినా ఎటువంటి సమాధానం రాలేదు. కొంతసేపటికి ఆమె కార్యాలయంలో స్పృహ తప్పి నేలకూలింది. దీంతో సహచరులు దగ్గరిలోని ఓ ప్రవేట్ ఆసుపత్రికి తరలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనంతరం ఆమె కోలుకున్నాక ఇంటికి తరలించారు.

ముగిసిన శిక్షణా తరగతులు

రంగంపేట, ఆగస్టు 14: మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయని ఎంపీడీవో పి.వెంకటరత్నం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వారికి పంచాయతీ విధులు, బాధ్యతలు, పారిశుధ్యం, చెత్త సేకరణ, కర్మి కంపోస్ట్ తయారీ, వీధి దీపాల ఏర్పాటు, ఘన వ్యర్థాల నిర్వహణపై క్షేత్రస్థాయిలో పరిశీలన వంటి అంశాలపై మాస్టర్ ట్రైనీలు లంకా త్రిమూర్తులు, జీవీ రమణ, ఎస్.కాత్యాయని అవగాహన కలిగించారని చెప్పారు.

ఎంపీ పురందేశ్వరిని కలిసిన ఎస్పీ

రాజమహేంద్రవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎంపీ పురందేశ్వరిని ఎస్పీ నరసింహ కిషోర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలు, నేరాల వంటి వాటిపై చర్చించారు.

ట్రాఫిక్ ఉపకరణాల అందజేత

ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు ఎస్పీ నరసింహ కిషోర్ హెల్మెట్, రేడియం జాకెట్, బ్యాటన్‌లను అందజేశారు. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్‌కి అనుగుణంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు ఇబ్బంది రాకుండా ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరించాలని సూచించారు. ట్రాఫిక్ జామ్‌లు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ఎస్ఆర్ రాజశేఖర్‌రాజు, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు అండగా నిలవాలి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

రాజమహేంద్రవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు అండగా నిలవడం బాధ్యతగా సమాజంలోని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. తాడితోటలోని భవిత ఉప కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. పిల్లలకు అందుతున్న ఆహార, వసతులను పరిశీలించారు. వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. వారికి అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాలు, న్యాయ సేవలను వివరించారు. విభిన్న ప్రతిభావంతులు అనేక రంగాల్లో రాణిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. విభిన్న ప్రతిభావంతులపై వివక్ష చూపడం, అగౌరవ పరచడం, చులకనగా చూడడం వంటివి నేరమన్నారు. మానసిక ఎదుగుదలకు తోడ్పడే శిక్షణా కార్యకలాపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సదరం సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాలు, వైద్యం వంటి విషయాల్లో ఏ అవసరం వచ్చిన డీఎల్ఎస్ఏ వారికి సహకరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ ఎస్.సుభాషిణి, ఫిజియోథెరపిస్టు కె.మధు, ఎన్‌వీఆర్ స్కూల్ హెచ్ఎం డేవిడ్ లివింగ్‌స్టన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల అందజేత

దివాన్‌చెరువు, ఆగస్టు 14: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమం కింద తమ బాంకు ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించినట్లు దివాన్‌చెరువులోని కెనరా బ్యాంకు బ్రాంచి మేనేజర్ డి.ఢిల్లీరావు తెలిపారు. పాలచర్లలోని జడ్పీ హైస్కూల్లో ఐదు నుంచి పదో తరగతి వరకూ అత్యధిక మార్కులు పొందిన ఆరుగురు ఎస్సీ, ఎస్టీ బాలికలకు రూ24 వేలును అంబేడ్కర్ విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ కింద అందజేశామన్నారు. హెచ్ఎం పి.ఆదినారాయణ మాట్లాడుతూ ఈ ఉపకారవేతనాలకు ఎంపికైన విద్యార్థుల పేరిట బ్యాంకు ఖాతాలు తెరచి ఆ సొమ్మును జమచేశారన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సహాయ మేనేజర్ వి.సురేష్, నాయకులు గంగిశెట్టి చంటిబాబు, సూరపురెడ్డి రాజారావు, గంగిశెట్టి రాజేంద్ర పాల్గొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా జరుపుకోవాలి

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఆగస్టు 14: ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్య వచ్చిందని, ఆ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం కొవ్వూరులోని మెరక వీధి వాటర్‌ట్యాంకు నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వందడుగుల జాతీయ జెండాతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బావన రత్నకుమారి, సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, దాయన రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కె.డానియేల్ జోసఫ్, ఎంపీడీవో కె.సుశీల, ఇన్‌చార్జి తహశీల్దార్ అజయ్‌బాబు, ఎంఈవో జె.కెంపురత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని గణపతి సెంటరులో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీని మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ ప్రారంభించారు. దేశ భక్తిని పెంపొందించే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని ఆయన అన్నారు. అనంతరం మున్సిపల్ అధికార్లు సిబ్బంది, పలు పాఠశాలల విద్యార్థులు జాతీయ జెండాలతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామ్ భూపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో ఎంపీడీవో కార్యాలయం వద్ద నుంచి మూడు రోడ్ల సెంటర్ వరకు అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఎంపీడీవో బీ.ప్రభాకరరావు, ఎంఈవోలు తిరుమలదాసు, అప్పారావు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● దేవరపల్లి ఎంపీడీవో ప్రభాకరరావు ● సర్పంచ్‌లు, కార్యదర్శులకు ముగిసిన శిక్షణ తరగతులు

దేవరపల్లి/కొవ్వూరు, ఆగస్టు 14: గ్రామాల్లో పంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణపై కార్యదర్శులు, సర్పంచ్‌లు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఎంపీడీవో ప్రభాకరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజులుగా సర్పంచ్‌లు, కార్యదర్శులు శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ చెత్త నుంచి సంపద కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, గ్రామాల్లో సేకరించిన పొడిచెత్తను, తడిచెత్తను వేరువేరు చేసి కంపోస్టు ఎరువులా తయారు చేస్తే ఇటూ పంచాయతీలకు ఆదాయం, రైతులకు తక్కువ ధరలో ఎరువు దొరుకుతుందన్నారు. గ్రామాల్లో ప్రధాన సమస్యలైన తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణలో పాల్గొన్న సర్పంచ్‌లు, కార్యదర్శులకు ఎంపీపీ కాకర్ల నారాయుడు, డీడీవో శాంతమణి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సుశీల, ఈవోపీఆర్డీ కె.శర్మ, మాస్టర్ ట్రైనీలు వై అలేఖ్యా సువర్చలా, సీహెచ్ అశాఅలేఖ్య డి.ముత్యం, కేఎస్వీ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌ల అందజేత

ఉండ్రాజవరం, ఆగస్టు 14: మండలంలోని సూర్యారావుపాలెం హైస్కూలుకు చెందిన 100 మంది విద్యార్థులకు తణుకు ఆర్టీసీ డిపో వారు ఉచిత బస్‌పాస్‌లను బుధవారం అందజేశారు. గ్రామానికి చెందిన కాపు జేఏసీ నాయకుడు వేమన శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ నందిన శ్రీనివాసరావుల ఆర్థిక సహాయంతో విద్యార్థులకు బస్‌పాస్‌లను పంపిణీ చేశా రు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మెండె శ్రీని వాస్, తణుకు డిపో ఉద్యోగులు ఎం.వెంకటరత్నం, కె.శ్రీనివాసరావు,హెచ్‌ఎం జీపీ ప్రకాశం పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

తాళ్లపూడి, ఆగస్టు 14: యువత చదువుపైనే శ్రద్ధ పెట్టాలని, సమాజంలో యువతను పెడదోవ పట్టిస్తున్న మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో మమ్మి అన్నారు. బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిషేదంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పిల్లలు మంచి విద్య నేర్చుకుంటారనే నమ్మకంతో కళాశాలకు పంపిన తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయవద్దని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో ఎంఈవో బాలామణి, కళాశాల ప్రిన్సిపాల్ గరగ శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన కుందుల

పెరవలి, ఆగస్టు 14: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి రాజమహేంద్రవరం విమానాశ్రయం వద్ద టీడీపీ నాయకుడు కుందుల వీరవెంకటసత్యనారాయణ బుధవారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పారు. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ సోదరుడు సూర్యనారాయణ ఇటీవల మృతి చెందడంతో ఆయనను పరామర్శించేందుకు కిరణ్‌కుమార్‌రెడ్డి వచ్చారు. దీంతో ఆయనను కుందుల తన వాహనంలో ఎక్కించుకుని పితాని వద్దకు తీసుకెళ్లారు.

నల్లజర్ల గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

నల్లజర్ల, ఆగస్టు 14: నల్లజర్లలోని శాఖ గ్రంథాలయ అభివృద్ధికి నూతన అభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు గ్రంథాలయ నిర్వాహకురాలు రమణ పేర్కొన్నారు. బుధవారం నల్లజర్ల శాఖా గ్రంథాలయంలో అభివృద్ధి కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా గుదే సుశీల, వైస్ చైర్మన్‌గా గొట్టిపాటి శ్రీరామమూర్తి, సభ్యులుగా కూచిపూడి వెంకట పద్మావతి, మల్లిపూడి ఉరమయ్య తాడి రమేష్‌ను ఎన్నుకున్నారు.నూతన కమిటీని గ్రంథాలయ నిర్వాహకురాలితోపాటు టీడీపీ నాయకుడు ఆలపాటి రామకృష్ణ, చింతా చైతన్య, సవలం రామకృష్ణ పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

గోపాలపురం సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, ఆగస్టు 14: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. ఆయా శాఖల్లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను గుర్తించి వాటిని నివేదిక రూపంలో అందించాలన్నారు. అంతకు ముందు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గోపాలపురంలో జడ్పీ హైస్కూల్ నుంచి ప్రభుత్వాసుపత్రి వరకు త్రివర్ణ పతకాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరు జాతీయభావం పెంపొందించుకోవడంతో పాటు నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణం జరిగినప్పుడే రాష్ట్రం, దేశ గౌరవం పెరుగుతుందని ఎమ్మెల్యే మద్దిపాటి అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రమేష్, తహశీల్దార్ ప్రదీప్, వైస్ ఎంపీపీ వంగా వెంకటరమణ, ఆయా శాఖల అధికారులు, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

జెండా పండుగకు తరలి రండి

నల్లజర్ల, ఆగస్టు 14: ఈ నెల 15న అన్ని గ్రామాల్లో జరిగే జెండా పండుగకు కూటమి సభ్యులు తరలి రావాలని టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణతోపాటు నల్లజర్ల బస్‌స్టాండ్ ప్రారంభోత్సవం, అనాథ హాస్టల్‌లో విద్యార్థులకు దుప్పట్లు, పండ్లు, చెప్పులు అందజేయడం వంటి కార్యకమాలు నిర్వహిస్తామని చెప్పారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 15 ఆగస్టు 2024 | 7



'తూర్పు' డీడీఎఫ్‌వోకి

రాష్ట్రపతి మెడల్

రాష్ట్రంలో ఒక్కరికే పురస్కారం

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రకటించిన రాష్ట్రపతి పతకాల్లో డీడీఎఫ్‌వోగా విధులు నిర్వర్తిస్తున్న చిన్నం మార్టిన్ లూథర్‌కింగ్‌కి రాష్ట్రపతి ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు. రాష్ట్రంలో ఫైర్ సర్వీసుకు సంబంధించి లూథర్ కింగ్ ఒకరికే ఈ గౌరవం దక్కింది. - రాజమహేంద్రవరం



ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో ఏర్పాట్లు

మువ్వన్నెల పండుగకు ముస్తాబు!

నేడు ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో 78వ స్వాతంత్ర్య వేడుకలు

9 శాఖల శకటాల ప్రదర్శన.. 9 స్టాల్స్ ఏర్పాటు





రాజమహేంద్రవరం సిటీ/రూరల్, ఆగస్టు14: తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కేంద్రమైన రాజమహేంద్రవరంలో 78వ స్వాతంత్ర్య దిన వేడుకలు అంగరంగవైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం పూర్తిచేసింది. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు అంబరాన్ని అంటుతున్నాయి. ర్యాలీలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం గురువారం రిహార్సల్స్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్‌తో కలిసి ఏర్పాట్లను, శకటాల ప్రదర్శన, పోలీస్ కవాతులను కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి 9 శాఖల శకటాలను ఏర్పాటుచేశారు. అలాగే 9 స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా, వ్యవసాయం, హార్టికల్చర్, పాఠశాల విద్య, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, డ్వామా, జిల్లా గ్రామీణ నీటి సరఫరాల శాఖ, వైద్యం, పశుసంవర్ధక, రుడా శాఖల శకటాలు ప్రదర్శన ఏర్పాటుచేశారు. అలాగే మెప్మా, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, మత్స్యశాఖ, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్, పౌర సరఫరాలు, పర్యాటక, సహకార, బ్యాంకింగ్, పరిశ్రమలశాఖలకు చెందిన 9 స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా జాతీయ జెండాను ఎగురవేస్తారు. వేడుకల కోసం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.

అన్నిచోట్ల స్వాతంత్ర్య వేడుకలు జరగాలి : కలెక్టర్

జిల్లావ్యాప్తంగా అన్నిచోట్లా 78వ స్వాతంత్ర వేడుకలు జరగాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఈమేరకు కలెక్టర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాన కూడళ్లు, దేవాలయాలు, మసీదులు, చర్చిల వద్ద స్వాతంత్ర్య దిన వేడుకలు జరపాలని, జాతీయ జెండాలు ఆవిష్కరించి ఫొటోలు దిగి గ్రూప్‌లలో పోస్టు చేయాలన్నారు. రాజమహేంద్రవరంలో కందుకూరి వీరేశలింగంపంతులు నివాసం, దామెర్ల ఆర్ట్ గ్యాలరీ, గౌతమి గ్రంథాలయం, పుష్కరఘాట్, వై.జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్, కోటిపల్లి బస్టాండ్, గోకవరం బస్టాండ్, ప్రభుత్వ ఆర్ట్స్‌కాలేజ్, మహిళా కళాశాల, విద్యా సంస్థలు, వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలు, ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలు, రైతు సేవాకేంద్రాలు, ఎన్టీఆర్ హెల్త్ క్లినిక్స్, అన్నా క్యాంటీన్ల వద్ద స్వాతంత్ర్య దినోత్సవం చేసి ఆయా ఫొటోలను టూరిజం అధికారులకు పంపాలన్నారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకోవాలని కోరారు.



రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌లో గోదావరి హారతి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, కళాకారిణులు


మరింత శోభనిచ్చేలా గోదావరి హారతి

హారతి కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు14: ఆజాదీకా అమృత్ ఉత్సవ్ భాగంగా హర్ ఘర్ తిరంగ జెండా కార్యక్రమంలో భాగంగా గోదావరి నది ఒడ్డున గోదావరి హారతి కార్యక్రమం, జాతీయ జెండా పండుగలో కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొన్నారు. ఆజాదీకా అమృత్ ఉత్సవ్ వేడుకల్లో భాగంగా బుధవారం పర్యాటక, దేవదాయ, మత్స్యశాఖ, ఆర్ఎంసీ ఆధ్వర్యంలో పుష్కర్‌ఘాట్ వద్ద సాంస్కృతిక, ఆధ్యాత్మిక, జాతీయ జెండా ప్రదర్శన, మత్స్యకారుల ప్రదర్శనలు నిర్వహించారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రానున్న రోజుల్లో గోదావరి హారతి కార్యక్రమానికి మరింత శోభ చేకూర్చేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పండితులు శోభాయమానంగా, భక్తి ప్రపత్తులతో హారతులు సమర్పించారు. విజయశంకర సంగీత కళాశాల చిన్నారులు జాతీయ స్ఫూర్తినిచ్చే నృత్య ప్రదర్శన ఇచ్చారు. చివరిగా మత్స్యకారులతో, నృత్య కళాకారులతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రశాంతి జెండా ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్నారు.



హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం గోదావరి బండ్ పుష్కరాల రేవు వెలుపల ర్యాలీ నిర్వహిస్తున్న పురందేశ్వరి, ఆదిరెడ్డి శ్రీనివాస్



జేసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న చినరాముడు

జేసీగా చినరాముడు బాధ్యతల స్వీకారం

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 14: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన ఎస్.చిన రాముడు తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా జేసీగా పనిచేసిన తేజ్‌భరత్ బదిలీ అయ్యాక ఇన్‌చార్జి జేసీగా డీఆర్‌వో నరసింహులు వ్యవహరిస్తున్నారు. అయితే తాజాగా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమితులైన చినరాముడు బుధవారం వచ్చి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం జిల్లాలో ప్రాధాన్యత అంశాలపై వారు చర్చించుకున్నారు. జేసీ చినరాముడును జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, ఇతర శాఖ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.



వేగేశ్వరపురంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పురందేశ్వరి, ఎమ్మెల్యే ముప్పిడి, పోచవరం వద్ద కొవ్వాడ కాలువ పరిశీలిస్తున్న దృశ్యం

కొవ్వాడ కాలువ ముంపు సమస్యను పూర్తిగా పరిష్కరిస్తాం!

ఎంపీ పురందేశ్వరి

తాళ్లపూడి, ఆగస్టు 14: మండలంలోని కొవ్వాడ ముంపు గ్రామాలను ఎంపీ పురందేశ్వరి బుధవారం పర్యటించారు. ముందుగా మండలంలోని వేగేశ్వరపురం, అన్నదేవరపేట గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అనంతరం తాడిపూడి మీదుగా పోచవరంలో కొవ్వాడ కాలువ వద్ద గల కల్వర్టును, పలు ప్రాంతాల్లో వర్షాలకు, కొవ్వాడ నీటి తాకిడికి గురైన పంటలను సందర్శించారు. అక్కడ నుంచి రాగోలపల్లి, అన్నదేవరపేట, తిరుగుడుమెట్ట వద్ద గల కల్వర్టులను సందర్శించారు. అన్నదేవరపేట గ్రామంలో ఎంపీ మాట్లాడుతూ కొవ్వాడ కాలువకు ఇరువైపులా గట్టు సరిలేకపోవడం, కల్వర్టులకు తూములు ఏర్పాటు చేయడం వల్ల అవి చెత్తతో పూడుకుపోతున్నాయని, దీంతో కొవ్వాడ నీరు పొలాల్లోకి వస్తోందని, కొవ్వాడ కాలువ ఎక్కడ ప్రారంభమైందో అక్కడి నుంచి ప్రక్షాళన చేసుకుంటూ రావాలన్నారు. ఎక్కడెక్కడైతే మరమ్మతులు చేయాలో పూర్తి నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను కోరినట్టు ఆమె తెలిపారు. కొవ్వాడ నీరు గోదావరిలోకి వెళ్లేవిధంగా చర్యలు తీసుకుంటామని, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సహకారంతో కొవ్వాడ పైనుంచి కింద వరకూ పూర్తిగా పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, ఆల్లూరి విక్రమాదిత్య, కాకర్ల సత్యేంద్ర, గంటా కృష్ణ, ఇందుగుల రామకృష్ణ, పరిమి రాధాకృష్ణ, బొమ్మల దత్తు, రేలంగి శ్రీదేవి, కోడూరి లక్ష్మీనారాయణ, గోకవరపు జితేంద్ర, నక్కా వెంకటేశ్వరరావు, తిరుమలశెట్టి కృష్ణ, కలిశెట్టి సన్యాసినాయుడు, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, తహసీల్దార్ రవీంద్రనాథ్, ఎంఈవో బాలామణి, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.